నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 23 ఏప్రిల్ 2024 | NALGONDA

నల్లగొండ నుంచే కేసీఆర్ శంఖారావం

రేపు మిర్యాలగూడ, సూర్యాపేటలో రోడ్ షో

ఈ నెల 25న భువనగిరిలో..

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నేడు నల్లగొండలో అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి నామినేషన్

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 22(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికల శంఖారావం పూరించేందుకు నల్లగొండ మరోసారి వేదిక కానుంది. రాష్ట్రంలోనే తొలి ఎన్నికల ప్రచార రోడ్ షోకు మిర్యాలగూడ సిద్ధమవుతున్నది. బుధవారం సాయంత్రం 5.30 గంటలకు మిర్యాలగూడలో కేసీఆర్ తొలి రోడ్ షో జరుగనుంది. అనంతరం 7గంటలకు సూర్యాపేటలో రోడ్ షోలో కేసీఆర్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. వరుసగా రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీఆర్ ఎన్నికల ప్రచారం, పర్యటన ఉండడంతో బీఆర్ఎస్ ముఖ్యులంతా దానిపైనే దృష్టి కేంద్రీకరించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కీలకమైన రెండు కార్యక్రమాలకు కూడా ఉమ్మడి జిల్లానే వేదికగా ఎంచుకోవడం తెలిసిందే. కేఆర్ఎంబీకి నాగార్జున సాగర్ ప్రాజెక్టును అప్పజెప్పడాన్ని నిరసిస్తూ నల్లగొండ గడ్డ మీద నుంచే కేసీఆర్ తొలిసారి గర్జించారు. భారీగా పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు తరలిరావడంతో మంచి స్పందన వచ్చింది. అనంతరం గత నెల 31న ఎండిన పొలాలను పరిశీలించి, రైతులను ఓదార్చడానికి కూడా ఉమ్మడి జిల్లా నుంచే కేసీఆర్ శ్రీకారం చుట్టారు. తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలో పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రైతుల పక్షాన రేవంత్ సర్కార్‌ను నీలదీశారు. ఆ వెంటనే ప్రభుత్వం వైపు నుంచి కాళేశ్వరంతో పాటు సాగర్ నుంచి కూడా నీళ్లు విడుదల చేయక తప్పలేదు. ఇక ఇప్పుడు ఎన్నికల ప్రచారం కూడా నల్లగొండ నుంచే షురూ చేస్తుండడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ అనేక కీలక సందర్భాల్లో నల్లగొండనూ వేదికగా చేసుకుని కేసీఆర్ కార్యాచరణను మొదలుపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత కాంగ్రెస్ సర్కార్ హామీల అమలులో వైఫల్యం చెందడంతో పాటు సాగునీళ్లు ఇవ్వకుండా, రైతుబంధు వేయకుండా మోసం చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజలు కూడా పునరాలోచనతో కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ప్రజలు తిరిగి కేసీఆర్ వైపే చూస్తున్న పరిస్థితి నెలకొంది. లోక్‌సభ ఎన్నికల వేదికగా కాంగ్రెస్ బండారం బయటపెట్టేందుకు కేసీఆర్ సిద్ధం అయ్యారు. ఈ నేపథ్యంలో రేపు జరుగనున్న మిర్యాలగూడ, సూర్యాపేట రోడ్ షోలో కేసీఆర్ ప్రసంగంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. రోడ్ షోకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు కావాల్సిన ఏర్పాట్లను జగదీశ్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. సోమవారం భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం ముఖ్య నేతలతో కేసీఆర్ రోడ్ షో పై జగదీశ్ రెడ్డి సమీక్షించారు. ప్రజల నుంచి మంచి స్పందన ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సోమవారం సాయంత్రం మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్ రావు, భూపాల్ రెడ్డి తదితరులతో జగదీశ్‌రెడ్డి రోడ్ షో ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ నెల 24, 25 తేదీల్లో జరిగే కేసీఆర్ రోడ్ షోలను గ్రాండ్ సక్సెస్ చేయాలని ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి పార్టీ శ్రేణులు, జిల్లాలో ప్రజలకు పిలుపునిచ్చారు.

నేడు కృష్ణారెడ్డి నామినేషన్

నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో పాటు జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్సీ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మాజీ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చే పార్టీ నేతలు, కార్యకర్తలతో హైదరాబాద్ రోడ్ లోని లక్ష్మి గార్డెన్స్ నుంచి క్లాక్ టవర్ మీదుగా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీకి సన్నాహాలు చేస్తున్నారు. బుధవారమే కేసీఆర్ రోడ్ షో ఉన్న నేపథ్యంలో నేటి నామినేషన్‌ను పెద్దగా హంగామా లేకుండా నిర్వహించాలని భావిస్తున్నట్లు సమాచారం.

నల్లగొండలో 10.. భువనగిరిలో 11 మంది

నాలుగో రోజు నామినేషన్ల అందజేత

నీలగిరి, ఏప్రిల్ 22 : నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియలో నాలుగో రోజు సోమవారం పదిమంది అభ్యర్థులు పది సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో ఐదుగురు వివిధ పార్టీల అభ్యర్థులు కాగా మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు తమ నామినేషన్లను జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనకు అందజేశారు. ఆధార్ పార్టీ నుంచి ఏడ నాగపుల్లారావు, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి, ఎం సీపీఐ(యూ) నుంచి వసుకుల మట్టయ్య, ధర్మ సమాజ్‌పార్టీ నుంచి తలారి రాంబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా మర్రి నెహమియా, పోనుగోతు లాల్‌సింగ్‌నాయక్, చీదల్ల వెంకట్‌సాంబశివరావు, లింగం కృష్ణ, వంగపల్లి కిరణ్ నామినేషన్ దాఖలు చేశారు.

భువనగిరిలో కలెక్టర్ హనుమంతు జెండగేకు నామినేషన్ పత్రాలను అందిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, చిత్రంలో మాజీ మంత్రులు పొన్నాల, ఉమా మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సునీతామహేందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి

నల్లగొండలో నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్ : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ నాలుగో రోజు కొనసాగింది. సోమవారం పదకొండు మంది అభ్యర్థులు 15 సెట్ల నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగేకు సమర్పించారు. నామినేషన్ దాఖలు చేసిన వారిలో భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్ 3 సెట్లు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి నల్ల కరుణాకర్‌రెడ్డి, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ అభ్యర్థి వింధ్యాల సదానందరెడ్డి 2 సెట్లు, తెలంగాణ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి కందాడి మణిపాల్‌రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి కొంగర లింగస్వామి 2 సెట్లు, స్వతంత్ర అభ్యర్థులు వరికుప్పల కృష్ణ, భాషబోయిన లక్ష్మయ్య, కొంగరి మల్లయ్య, గాదెపాక అనిల్‌కుమార్, ఈదుల వీరపాపయ్య 2 సెట్లు, నక్కల సురేందర్, నామినేషన్ దాఖలు చేశారు.

మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి నామినేషన్ వేసిన క్యామ మల్లేశ్

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి క్యామ మల్లేశ్ సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ రాష్ట్ర జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

అకాల వర్షం.. అపార నష్టం

- నేలరాలిన మామిడి.. తడిసిన ధాన్యం
- విరిగిపడిన చెట్లు.. నేలకూలిన విద్యుత్ స్తంభాలు

నార్కట్‌పల్లి/చిట్యాల/బొడ్రాయిబజార్/ ఏప్రిల్ 22 : అకాల వర్షం రైతులను అతలాకుతలం చేసింది. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం మిగిలింది. సూర్యాపేట, నార్కట్‌పల్లి, చిట్యాల, మోత్కూరు, ఆత్మకూర్.ఎం, గుండాల, రామన్నపేట తదితర మండలాల్లో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. సోమవారం వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పండిన కొంత మేర పంట కూడా చేతికి దక్కకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నార్కట్‌పల్లిలో.. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిసి ముద్దయ్యింది. అమ్మనబోలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో టన్నుల కొద్ది ధాన్యం వరద నీటిలో కొట్టుకుపోయింది. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలాయి. చిన్నతుమ్మలగూడెంలో ఒక తోటలోని 21 నిమ్మచెట్లు విరిగిపడ్డాయి.

చిట్యాలలో.. మండలంలోని పలు గ్రామాల్లో దాదాపు గంట సేపు ఈదురు గాలులతో కూడిన వర్షానికి చెట్లు విరిగి పడ్డాయి. మామిడి కాయలు రాలిపోయాయి. వెలిమినేడుతోపాటు మరికొన్ని గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు పాక్షికంగా తడిశాయి.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో వర్షానికి సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన ధాన్యం కొంత తడిసింది. యాసంగి సీజన్ మొదలు నుంచి మార్కెట్‌కు ధాన్యం భారీగా వస్తుండడంతో కమీషన్‌దారులు, మిల్లర్లు తేమ పేరుతో అమాంతం ధరలు తగ్గించి మద్దతు ధర కంటే తక్కువగా కోడ్ చేస్తున్నారు. దాంతో కొందరు ఇష్టం లేని రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోకుండా మార్కెట్‌లోనే ఆరబెట్టుకునే ప్రయత్నం చేశారు. దాంతో ఆదివారం అకాలంగా వచ్చిన వర్షంతో ధాన్యం తడిసింది.

మోత్కూరు మండలం బుజిలాపురంలో నేలరాలిన మామిడి

నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన వరి ధాన్యం

నార్కట్‌పల్లి మండలం చిన్నతుమ్మలగూడెంలో నేలకూలిన నిమ్మచెట్టు

అధికారం కోసమే కాంగ్రెస్ బూటకపు హామీలు

- నాలుగు నెలల్లోనే పాత రోజులు తీసుకొచ్చారు
- ఆరు గ్యారెంటీల పేరుతో నిలువునా మోసం
- రైతులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ప్రజలు మళ్లీ మోసపోవద్దు.. ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి
- మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్
- జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

కొండమల్లేపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, పక్కన పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దవూర రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భగత్, ట్రైకార్ మాజీ చైర్మన్ రాంచందర్‌నాయక్

కొండమల్లేపల్లి/ పీఏపల్లి/ పెద్దవూర, ఏప్రిల్ 22 : అధికారం కోసమే కాంగ్రెస్ బూటకపు హామీలు ఇచ్చిందని, రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోని ఆ పార్టీని నమ్మి మళ్లీ మోసపోవద్దని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి సోమవారం కొండమల్లేపల్లి, పెద్దవూర, పెద్దఅడిశర్లపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్ కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేండ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లోనే పాత రోజులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఏ పల్లెకు పోయినా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామన్నా భావన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఎగ్గొట్టేందుకు సాకులు వెతుకుతుందని, ఇప్పుడు ఆగస్టు 15లోగా చేస్తామని ప్రజలను మభ్యపెడుతున్నదని అన్నారు. ఆ తర్వాత జనవరి 26 అంటారని ఎద్దేవా చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 209 మంది రైతులు అత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆటోవాలాల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, కుటుంబం గడువక 49 మంది ఆటో డ్రైవర్లు అత్మహత్య చేసుకున్నా రాష్ట్రప్రభుత్వానికి ఏ మాత్రం కనికరం లేదని విమర్శించారు. రైతులు బాగుపడడం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఇష్టం లేదని, అందుకే ప్రాజెక్టుల నుంచి నీరు వదలడం లేదని అన్నారు. 420 మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఝూటా పార్టీ అని విమర్శించారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి మల్లికార్జున్ రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, దేవరకొండ పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్, నాయకులు నేనావత్ కిషన్‌నాయక్, రమావత్ రమేశ్‌నాయక్, కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రూనాయక్, టీవీఎన్‌రెడ్డి, తులసీరాం నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదు

పక్కన కృష్ణమ్మ ఉన్నా పొట్ట దశకు వచ్చిన పొలాలను ఎండబెట్టిన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదు. ఎన్నో సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ ప్రాంతానికి చేసింది శూన్యం. ఇక ముందు కూడా చేయబోయేది ఏమీ లేదు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో పార్లమెంట్‌కు పంపితే మన జిల్లా సమస్యలు తీరుతాయి. ప్రజలంతా గమనించి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలి.

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కారు

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ వాటిని తుంగలో తొక్కి రైతులను, రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచింది. గతంలో కుటుంబ పాలన వద్దన్న జానారెడ్డి తన స్వార్థంతో ఒక కొడుకును ఎమ్మెల్యే చేసి, మరో కొడుకుకు ఎంపీ టికెట్ ఇప్పించుకున్నారు. ఆయనకు, ఆయన కుమారుడికి, కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి.

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

పీఏపల్లిలో బీఆర్ఎస్ రోడ్‌షోకు పెద్ద ఎత్తున హాజరైన జనం

ఆదరించండి.. ప్రశ్నించే గొంతుకనవుతా

'నన్ను ఆదరించి గెలిపిస్తే జిల్లా, రాష్ట్ర సమస్యలపై పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అభివృద్ధిలో నల్లగొండను ముందు వరుసలో నిలబెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మళ్లీ ఓట్లు ఎలా అడుగుతుంది. పంటలు ఎండిపోతున్నా, ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా పాలకులు నోరు మెదపడంలేదు. కేసీఆర్, బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకొని పరిపాలన సాగిస్తున్న కాంగ్రె.. తమ చేతగానితనాన్ని ఇతర పార్టీలపై రుద్దుతున్నది. నన్ను పార్లమెంట్‌కు పంపిస్తే నీతి, నిజాయితీ, నిబద్ధతతో పని చేస్తా.'

- కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి

కాంగ్రెస్ మాయ మాటలు నమ్మొద్దు

మోసకారి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు, రైతులు మళ్లీ నమ్మొద్దు. కేసీఆర్ పాలనలో మండు వేసవిలోనూ చెరువులు మత్తడి పోశాయి. కాంగ్రెస్ పాలనలో చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి. వేల రూపాయల పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఏ సంవత్సరం ఆగస్టులో చేస్తారో స్పష్టంగా ప్రకటించాలి. గతేడాది వానకాలంలో వరికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత వచ్చే ఏడాది ఇస్తామంటున్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఒక్కరికీ అందించలేదు.

- రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

ఆన్‌లైన్‌లో ప్రగతి పత్రాలు

- ఇప్పటికే 1నుంచి 9వ తరగతి విద్యార్థుల మార్కులు నమోదు
- నేడు పాఠశాలల్లో ప్రోగ్రెస్ రిపోర్టులు అందజేయనున్న టీచర్లు
- రేపటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

రామగిరి, ఏప్రిల్ 22 : విద్యార్థుల పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్‌లో అందించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఇప్పటికే 1నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు (ఎస్ఏ-2) నిర్వహించగా.. ఫలితాలు వెల్లడించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే.. గతంలో కంటే భిన్నంగా విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను ఆన్‌లైన్‌లో అందించేలా రాష్ట్ర విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. మంగళవారం పాఠశాలలకు చివరి రోజు కావడంతో విద్యార్థులకు టీచర్లు ఆన్‌లైన్ ప్రగతి పత్రాలను అందజేయనున్నారు.

ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో ఆన్‌లైన్‌లో ఫలితాలు

విద్యార్థులకు ఈ నెల 15నుంచి 21వరకు ఎస్ఏ-2 పరీక్షలు జరిగాయి. ఇప్పటికే ఎఫ్ఏ 1, 2, 3, 4 ఫలితాలతోపాటు ఎస్ఏ -1 ఫలితాలను ఆన్‌లైన్‌లో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నమోదు చేశారు. ఎఫ్ఏ - 2 జవాబు పత్రాలను ఉపాధ్యాయులు ఏరోజుకారోజు మూల్యాంకనం పూర్తి చేశారు. విద్యార్థులకు వచ్చిన మార్కులను ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేశారు.

గతంలో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పాఠశాల చివరి పని దినం రోజు అందజేసేవారు. ఈ పర్యాయం ఆన్‌లైన్‌లో ప్రగతి పత్రాలను డౌన్‌లోడ్ చేసి పూర్తి సమాచారంతో అందజేయనున్నారు. విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలు సంవత్సరంలో నిర్వహించిన ఎఫ్ఏ - 1, 2, 3, 4తో పాటు ఎస్ఏ - 1, 2 ఫలితాలతో ఆన్‌లైన్ ప్రగతి పత్రం ఉండనుంది. అది విద్యార్థులకు ఎప్పుడైనా అందుబాటులో ఉండనున్నది. గతంలో ప్రోగ్రెస్ కార్డులను విద్యాశాఖ సమగ్రశిక్ష నుంచి సరఫరా చేసేది. ప్రస్తుతం వాటి సరఫరా లేకపోవడంతో గత సంవత్సరం ఆన్‌లైన్ ప్రగతి ప్రతాల పంపిణీకి చర్యలు తీసుకోగా పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఈ పర్యాయం పూర్తిగా అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. విద్యార్థి ప్రస్తుతం చదివే బడి వదిలి కొత్త పాఠశాలకు వెళ్లే సమయంలో టీసీతోపాటు ఆన్‌లైన్ ప్రగతి పత్రం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసి సంతకం చేసి అందజేయాల్సి ఉంటుంది. నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,113 ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. వాటిల్లో 2,27,345 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారందరికీ మంగళవారం ఆయా పాఠశాలల్లో ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందజేస్తారు.

రేపటి నుంచి వేసవి సెలవులు

1నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు ఈ నెల 24నుంచి వేసవి సెలవులు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. 48 రోజుల పాటు సెలవులు వస్తుండగా.. పాఠశాలలకు మంగళవారం చివరి పని దినంగా చెప్పవచ్చు. జూన్ మొదటి వారం నుంచే బడిబాట కార్యక్రమం చేపట్టాలని విద్యాశాఖ భావిస్తుంది.

విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు అందజేయాలి

రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉత్తర్వుల మేరకు అన్ని పాఠశాలల్లో 1నుంచి 9వ తరగతి విద్యార్థులకు (2023-24) ఆన్‌లైన్ ప్రగతి పత్రాలు (ప్రోగ్రెస్ కార్డులను) అందజేయాలి. ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసిన ప్రగతి పత్రాలపై ప్రధానోపాధ్యాయులు సంతకం చేసి ఇవ్వాలి. ఈ పత్రాలు విద్యార్థుల ఫలితాలకు దర్పణంగా నిలుస్తాయి. విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా జిల్లాలో అందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్‌కు నాంది పలికేలా చర్యలు తీసుకుంటున్నాం.

- బి.భిక్షపతి, నల్లగొండ డీఈఓ

విద్యార్థుల సంఖ్య ఇలా..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
నల్లగొండ	1,485	1,03,877
సూర్యాపేట	909	63,805
యాదాద్రి	719	53,248
మొత్తం	3,113	2,27,345